క్లుప్తంగా

మహిళా పార్కులోకి ప్రవేశాలు ప్రారంభం

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా పార్కులోకి సందర్శకులను ఆదివారం నుంచి విడిచిపెట్టారు. మొదటి రోజు మహిళలు... చిన్నారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉల్లాసంగా గడిపారు. పార్కు పరిసరాల్లో కలియ తిరుగుతూ సందడి చేశారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులు పార్కును పరిశీలించారు. మహిళా పార్కు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు పార్కు తెరిచి ఉంటుందని మేయర్ తెలిపారు. మహిళలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రేమాలయంలో మాతృదినోత్సవం



మహిళలను సత్కరిస్తున్న చర్చి నిర్వాహకులు రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: అమ్మ త్యాగానికి మారు పేరని ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. మదర్స్ డే పురస్కరించుకుని పలువురు వృద్ధులను ఆదివారం ఘనంగా సత్కరించి, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఝాన్సీ, సుజన్, సునీత, మేరీ రత్నం, సువార్తమ్మ, తదితరులు బైబిల్‌లోని పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కోరాడ నాగేశ్వరరావు, దేవరాజు, విక్టర్ బాబు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు



మాతృదినోత్సవంలో పాల్గొన్న భీశెట్టి బాబ్జీ

జామి: మండలంలోని అట్టాడ బీఎస్ఆర్ ఆశ్రమంలో మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకు మించిన దైవం లేదని అన్నారు. ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైన పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకునే మహాతల్లి అమ్మ అని అన్నారు. సమాజంలో అమ్మపాత్ర అనిర్వచనీయమైనదని చెప్పారు. అనంతరం వృద్ధులకు భోజనాలు అందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లిలో బండారు రమేష్, వసంత అప్పన్న జ్ఞాపకార్థం జైభీమ్ యూత్ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను స్థానిక సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక యువతో పాటు పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

హిందూధర్మ ప్రచార రథం ప్రారంభం

గజపతినగరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రంలో హిందూ ధర్మప్రచార రథాన్ని ఆదివారం ప్రారంభించారు. ధర్మ ప్రచార నిర్వాహకులు యు.ఎస్.ఎస్ వర్మ ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలుతో పాటు పలువురు భక్తులు రథానికి పూజలు చేశారు. అనంతరం గజపతినగరం, పురిటిపెంట గ్రామాల్లో శోభా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ధర్మప్రచారకులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ, వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

గజపతినగరం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి మదుపాడ వైపు కాలినడకన వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనగడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108కు సమాచారం అందించి అపస్మారక స్థితిలో ఉన్న ఆ వ్యక్తిని గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. క్షతగాత్రుడికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, పేరు, ఇతర వివరాలు తెలియదని చెప్పారు.

ప్రజలందరిపై మారుతి అనుగ్రహం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- వాడవాడలా హనుమజ్జయంతి
- ప్రత్యేక పూజలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

విజయనగరం:

హనుమంతుడు ధైర్యం, విధేయత, విశ్వాసం, నమ్మకం, భక్తి, నిస్వార్థతకు మారుపేరని ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మారుతి అనుగ్రహం భక్తులందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలోని మూడు కోవెళ్లు, అయ్యకోనేరు తూర్పు గట్టున ఉన్న పెద్ద ఆంజనేయస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, కణపాక యాదవవీధిలోని శ్రీ అభయ అంజనేయస్వామి దేవాలయాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రామభక్త హనుమాన్‌కి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు, అర్చకులు కోలగట్లకు సాదర స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కోట సమీపంలోని హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద కోలగట్ల మాట్లాడుతూ, హనుమాన్ జయంతి సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. పంచముఖ ఆలయం వద్ద నిత్యాన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అయ్యన్నపేటలో వెలసిన హనుమాన్ ఆలయాన్ని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సందర్శించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు,అర్చకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ విజయనగరంలోని సిటీ బస్టాండ్, బుచ్చన్న కోనేరు, కణపాకలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవనాపు విక్రమ్‌కు ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు.



విజయనగరం: హనుమాన్ జయంతి వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు

ఘనంగా..

భోగాపురం: మండల కేంద్రంలోని మరాడ, కొమ్మూరు వీధుల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు ఆళ్ల విశ్వేశ్వరరావు, జగ్గపు వాసుదేవరావు, ఉదయబాబు, కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, పడాల భాను, తిరుమరెడ్డి చిన్నారావు, రౌతు వాసు, బొల్లు మోహన్ ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు, పవన్, గున్నబాబు స్వాములు వేదమంత్రాలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు బాలిపల్లి భాస్కరరావు, ఆళ్ల అప్పలస్వామి, గుండు వినోద్‌కుమార్, కొమ్మూరు రామకృష్ణ, ముద్దన రామకృష్ణ, జగ్గపు రవి, వాసు, తిరుమరెడ్డి మురళి, పోతిరెండి అప్పలరాజు, రమేష్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో..

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయుడికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతః కాలార్చన పూజలనంతరం ఆంజనేయస్వామి సన్నిధిలో స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శత నామావళి, సహస్రనామ స్తోత్రం, పారాయణాలు జరిపించారు. ఆంజనేయస్వామికి తమలపాకులు, సిందూరంతో అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆంజనేయస్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అనంతరం సీతారామస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని కొత్తపేట, సీతారామునిపేట, ఒమ్మి, కొండగుంపాం, తదితర ఆలయాల్లో జయంతి నిర్వహించారు. కొత్తపేటలో మారుతీ యువజన సంఘం ఆధ్వర్యంలో సుమారు 5వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.



భోగాపురం: మరాడవీధిలో కొలువైన అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో...

విజయనగరం టౌన్: హనుమజ్జయంతి వేడుకలు వాడవాడలా భక్తిశ్రద్ధలతో భక్తులు ఘనంగా నిర్వహించారు. హిందూ ధర్మప్రచార పరిషత్, టీటీడీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జొన్నగుడ్డి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ పర్యవేక్షించారు. స్థానిక సిటీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అభయాంజనేయస్వామికి అరటిపండ్లతో అలంకరణ చేశారు. ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగోజీపేట మయూరీ కూడలి వద్ద సంపత్ హనుమాన్ ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ఇసరపు శేఖర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విజయనగరం టౌన్: అరటిపండ్ల అలంకరణలో అభయాంజనేయస్వామి



విజయనగరం: హనుమంతునికి పూజలు నిర్వహిస్తున్న అవనాపు విక్రమ్



విజయనగరం టౌన్: నాగోజీపేట జంక్షన్‌లో ప్రత్యేక పూజలందుకుంటున్న సంపత్ ఆంజనేయస్వామి



విజయనగరం: అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



నెల్లిమర్ల: కొత్తపేటలో అన్నదానం

లండన్ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: సంతానలేమితో బాధపడే ఎంతో మంది తల్లులకు తల్లి కావాలన్నా కోరికను లండన్ ఐవీఎఫ్ సెంటర్ వారు తీర్చుతున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. పట్టణంలోని మతం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన లండన్ ఐవీఎఫ్ సెంటర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లండన్ ఐవీఎఫ్ సెంటర్‌లో మంచి సేవలు అందుతాయని తెలిపారు. ఇటువంటి సెంటర్ విజయనగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఐవీఎఫ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రారెడ్డి మాట్లాడుతూ, విశాఖపట్నంలో మొదటిసారిగా 2015లో లండన్ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించామని చెప్పారు. క్రమంగా రాజమండ్రి, కాకినాడ పరిసర ప్రాంతాలకు సేవలు అందించేందుకు శాటిలైట్ శాఖలను ప్రారంభించినట్లు చెప్పారు. నాణ్యమైన ధరలకే లండన్ స్థాయి చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ బీవీ రవిచంద్ర, డాక్టర్ విద్యావతి, డాక్టర్ సుధాకుమారి, డాక్టర్ అనన్య, తదితరులు పాల్గొన్నారు.



లండన్ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

● మురుగునీటిలో పైప్‌లైన్..

నెల్లిమర్ల నగర పంచాయతీ మొయిద జంక్షన్ వద్ద తాగునీటి పైప్‌లైన్ మురుగునీటిలో మునిగిపోయి దర్శనమిస్తోంది. దీంతో తాగునీరు కలుషితమవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వ్యాపారులు తమ వ్యర్థాలను కాలువలో పడవేయడం వల్లే ఇలా జరుగుతోందని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. నగర పంచాయతీ అధికారులు అప్పడప్పుడు కాలువలో పూడికలు తీయిస్తున్నారు గాని శాశ్వత పరిష్కారం చూపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పబ్లిక్ హెల్త్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి పైప్‌లైన్‌ను బయటకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



– నెల్లిమర్ల

సంక్షేమ పాలన అందిస్తున్న ఏకైక సీఎం జగన్



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ప్రతీ నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకు పింఛను సొమ్మును పంపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తామరాపల్లి సచివాలయం కోనసమసివానిపాలెం గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా అధికారులు, పార్టీ నాయుకులతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నమోదు చేసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని, గడపగడపకు వెళ్లినపుడు జగనన్న పాలన అద్భుతంగా ఉందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గడిచిన నాలుగేళ్లలో పల్లెలు, పట్నాలు అనే తేడా లేకుండా అభివృద్ధి చేశారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరవేశారన్నారు. త్వరలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు బొడ్డు గణపతి, బండ కృష్ణవేణి, కొత్తవలస మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్, కల్లేపల్లి సర్పంచ్ గోకేడ ముసలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానానికి యువత ముందుకు రావాలని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో విధి నిర్వహణలో ఉండగా ఇటీవల మృతి చెందిన జేఎల్ఎం మద్దిల శివ జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు (రైజింగ్ స్టార్స్ యూత్), స్థానిక సాధనా యువజన సంఘ ప్రతినిధులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ, స్నేహితుడి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అంతకుముందు శివ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 65 మంది రక్తదానం చేయగా, నిర్వాహకులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, 17వ వార్డు కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ కె. హర్షవర్ధన్ రాజు, గరివిడి ఎంఈఓ పి.రామారావు, స్థానిక పెద్దలు తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీను, ఎంఎం నాయుడు, సుదర్శన్‌బాబు, తాలాడ మహేష్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఈసీ సభ్యుడు పోలుబోతు దుర్గాప్రసాద్, పీఆర్‌ఓ ముడిదాపు రాము, సాధనా ప్రతినిధులు బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

టీడీపీ వాళ్లకి కండువాలు వేస్తే పార్టీ మారినట్లేనా?

దత్తిరాజేరు: టీడీపీ వాళ్లకి కండువాలు వేస్తే పార్టీ మారినట్లేనా అని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు ప్రశ్నించారు. పెదమానాపురం సంతతోట వద్ద జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడుతో కలిసి ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పి.లింగాలవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలను రామచంద్రాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు గత ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ తరపున నామినేషన్ వేసిన పప్పల త్రినాథ, టీడీపీ ఉప సర్పంచ్ భర్త ముకుందరావులతో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి 120 కుటుంబాలు చేరినట్లు పత్రికలలో రాయించడం సమజంసం కాదన్నారు. నిజంగా అధికార పార్టీ నాయకులు పార్టీ వీడినట్లు అయితే గ్రామంలో ఎందుకు సభ పెట్టి కండువాలు వేసుకునే సాహసం చేయలేదని కొత్తల మంగమ్మ సర్పంచ్ భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు తవుడు ఆరోపించారు. వారితో పాటు వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మండల శ్రీను, వింధ్యవాసి సర్పంచ్ రంభ చంద్రశేఖర్, నాయకులు రెడ్డి సంహాచలం, ఇనుముల ఈశ్వరరావు, సిరిపురపు శంకరరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సంప్రదాయంగా మార్చుకుందాం..

వేపాడ: పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇలా ప్రతీ పండగకు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సంప్రదాయంగా మార్చుకోవాలని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన గెంటేల యుగంధర్, కల్యాణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా 80 మొక్కలను ఆదివారం అందజేశారు. బానాదిలో పరదేశమ్మ ఆలయ ప్రాంగణంలో 15 కొబ్బరి మొక్కలు, జగ్గయ్యపేటలో 65 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు సంస్థ కృషిచేస్తోందన్నారు. మొక్కలు పెంచడం వల్ల వాటి ఫలసాయాన్ని అనుభవించడమే కాకుండా, వాటి వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిమ్ సంస్థ డైరెక్టరు వై.విజయ, జియో సహ కార్యదర్శి లోంగేది హరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు గుమ్మడి శ్రీనివాసరావు, సత్యం, శివం, గణేష్, దేముడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

చీపురుపల్లి రూరల్(గరివిడి): వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు, పెన్షనర్ల సంఘం సలహాదారుడు వీవీఎస్ఎస్ఎన్ గుప్త విద్యార్థులకు సూచించారు. గరివిడి శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు గణితం, ఆంగ్లంతో పాటు ఇతర సబ్జెక్టులలో లోతైన పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని మెరుగుపర్చుకునేందుకు ప్రభుత్వం ఈ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విజ్ఞాన శిబిరాలకు పంపించాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన కర్రోతు సతీష్ S/o పైడి నాయుడు మరియు గార మౌనిక W/o కర్రోతు సురేష్ విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, నారుపేట గ్రామం H% ఏ రావివలస పంచాయితీకి చెందినట్టి అక్కివరం గ్రామ రెవెన్యూ పరిధిలోగల జిరాయితీ మెట్టుభూమి సర్వే నెం. 248-1లో 35 సెంట్లు భూమిని భోగాపురం మండలం, నారుపేట గ్రామ కాపురస్తులైన 1. ఇజ్జాడ సూర్యనారాయణ S/o Late రాత 2) యీతని కుమార్తెలు డెంకాడ మండలం అకులపేట గ్రామ కాపురస్తురాలు శ్రీమతి పొంద్రంకి లక్ష్మి W/o నగేష్, 3) విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, నారుపేట గ్రామ కాపురస్తురాలు శ్రీమతి ఇజ్జాడ రాణి W/o నారు సురేష్ అను వారుల వద్దనుండి కొనుగోలు చేయుటకు నా క్లయింట్లు క్రయపురోజి చేసుకొనియున్నారు. కావున పైన తెలిపిన భూమిపై ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపనలు కాని ఎవ్వరికైనా ఉన్నచో ఈ బహిరంగ ప్రకటన వెలువడిన తేదీనుండి 7 రోజులలో తెలియపరచవలసిందిగా కోరుచున్నాము. ఏవిధమైన అభ్యంతరములు రానియడల మా క్లయింట్లు సదరు భూమిపై ఎటువంటి వివాదములు లేని భూమిగా భావించి నా క్లయింటు రిజిస్ట్రేషన్ చేసుకుందురు.

పెద్దులు:

విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, నారుపేట గ్రామం, ఏ రావివలస గ్రామం పంచాయితీకి చెందినట్టి అక్కివరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల మెట్టుభూమికి హద్దులు: **సర్వేనెం. 248-1- 35 సెంట్లు** : **తూర్పు:** ప్రైవడ్ ఫ్యాక్టరీ గోడ, **దక్షిణ:** ఈ భూమి అమ్మినవారి మెట్టుభూమి, **పడమర:** ఈ భూమి అమ్మినవారి మెట్టుభూమి, **ఉత్తర:** రోడ్డు మరియు భాష్యం లే-అవుట్.

సం/- **కంది వెంకటేశ్వరరావు,** B.A., B.L., అడ్వకేట్ & నోటరీ, విజయనగరం.
9440705469, 8328627907